క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి


జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

బుచ్చినాయుడుకండ్రిగ: దోమకాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడు వాపు జ్వరాలు, బోధకాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. ఆయన శుక్రవారం కాటూరులోని దళితవాడ, గిరిజన కాలనీల్లో దోమల నివారణ, దోమలతో వచ్చే వ్యాధులు, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు కుట్టకుండా తెరలు, ఇంటి ద్వారాలకు కిటికీలకు, మెష్‌లు అమర్చాలని, ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్క నాటుతున్న ఎఫ్ఆర్ఓ

సత్యవేడు: ప్రతి వ్యక్తి మొక్కలు నాటి సంరక్షించాలని ఎఫ్ఆర్ఓ జయప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం మదనంబేడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వనమహోత్సవం సందర్భంగా ఫారెస్టు, విద్యాశాఖ, ఎంపీడీఓ, సర్పంచ్ శిరంజని ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కే. రవి, హెచ్‌ఎం చినబాబు, పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, వీకేఎస్ బాషా, మాజీ ఎంపీపీ మస్తాన్, స్కూల్ కమిటీ చైర్మన్ మునస్వామి, ఏపీఓ కష్ణయ్య, సెక్రటరీ మాధవి పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించాలని వినతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల అవరణలోని పిచ్చిమొక్కలను తొలగించాలని శుక్రవారం ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావుకు పాఠశాల ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మి, వైస్‌చైర్మన్ చెంగయ్య వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఉపాధిహామీ పథకంలో కూలీలతో పిచ్చిమొక్కలను తొలగిస్తామని హామీ ఇచ్చారు.

వెంకన్న ఆలయం మూసివేత

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేసినట్లు ఆయన అధికారి నాగరాజు తెలిపారు. ఆలయ సన్నిధి వీధిలో బాలిక(16) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. దీంతో ఆలయాన్ని శుక్రవారం సాయంత్రం మూసివేసినట్లు నాగరాజు తెలిపారు. శనివారం మధ్యాహ్నం దహన సంస్కారాలు అనంతరం ఆలయాన్ని తెరచి సంప్రోక్షణ, శుద్ధితో నిత్యపూజా కార్యక్రమాలు పూర్తి చేసి సాయంత్రం భక్తులను దర్శనానికి అనుమతిస్తామన్నారు.

అభివృద్ధికి సహకరించండి


వ్యర్థాలను తొలగిస్తున్న జేసీబీ

ఏర్పేడు: ప్రతి ఒక్కరూ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య అన్నారు. శుక్రవారం ఏర్పేడు సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న కోళ్ల వ్యర్థాలను జేసీబీతో తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ప్రజలు, స్థానికేతరులు కోళ్ల విక్రయ దుకాణ యజమానులు కోళ్ల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ విచ్చల విడిగా వేస్తున్నట్లు చెప్పారు. విచ్చలవిడిగా వ్యర్థాలను వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటీ, ఎన్ఓటీ ఇవ్వాలి


నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ నేతలు

శ్రీకాళహస్తి: ఆర్టీసీ ఉద్యోగులకు ఓటీ, నైట్ అవుట్ అలవెన్సులు ఇవ్వాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల అలవెన్స్‌లు ఎత్తివేయడాన్ని నిరసిస్తూ ఆర్టీసీ గ్యారేజీ వద్ద ఎన్‌ఎంయూ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఎన్‌ఎంయూ జిల్లా అధ్యక్షుడు గుణశేఖర్ మాట్లాడుతూ ట్రెజరరీ అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా ఉద్యోగుల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. ఎన్‌ఎంయూ నాయకులు వైడీ కుమార్, శివకుమార్, సీకే రెడ్డి, పీఎస్ ఖాన్, పీసీ కృష్ణ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ ఎస్ఐగా నరసింహారావు



శ్రీకాళహస్తి రూరల్: ఎస్ఐ నరసింహారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరి ఆయన్ని స్టేషన్ సిబ్బంది సాదరంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన తడ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్‌కి వచ్చారు.

పరీక్ష.. మారింది

పాఠశాలల్లో పరీక్షల విధానం మారింది. కూటమి ప్రభుత్వం యూనిట్ టెస్టుల విధానంలో మార్పులు తెచ్చింది. నిర్మాణాత్మక మూల్యాంకనం పేరును మార్చి స్వీయ మూల్యాంకనం అని కొత్తగా నామకరణం చేసింది. మూడు రోజుల్లో ముగిసే పరీక్షలను ఆరు రోజులు కొనసాగిస్తోంది. ఈ చర్య సిలబస్ పూర్తిపై ప్రభావం చూపి, విద్యార్థులు వెనుకపడడానికి కారణం కాబోతోంది. ఏది ఏమైనా కూటమి హయాంలో పరీక్ష మారింది.



- ప్రారంభమైన స్వీయ మూల్యాంకనం పరీక్షలు
- యూనిట్ పరీక్షలకు పేరు మార్పు
- సెల్ఫ్ అసెస్మెంట్‌గా (స్వీయ మూల్యాంకనం) నామకరణం
- మూడు రోజులు జరిగే పరీక్షలను 6 రోజులకు పొడిగింపు

వరదయ్యపాళెం: విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేసేందుకు యూనిట్ పరీక్షల పేరును సెల్ఫ్ అసెస్మెంట్ (స్వీయ మూల్యాంకనం)గా పేరు మార్చుతూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే మూడు రోజుల్లో నిర్వహించే పరీక్షలను ఆరు రోజులు నిర్వహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విద్యాశాఖలో సైతం కూటమి ప్రభుత్వం తన మార్కు పాలన దిశగా అడుగులు వేస్తోంది. విద్యార్థుల ప్రయోజనాలు పక్కన పెడితే వారికి అనుకూలంగా చర్యలు తీసుకోవడం గమనార్హం.

పరీక్షల వివరాలివీ..

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే యూనిట్ పరీక్షలను పేరు మార్చారు. యూనిట్ పరీక్షలను సెల్ఫ్ అసెస్మెంట్‌గా నిర్వహించనున్నారు. విద్యార్థుల సామర్థ్యం అంచనా వేసేందుకు పరీక్షలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. అలాగే గతంలో ఫార్మేటివ్ అసెస్మెంట్ (నిర్మాణాత్మక మూల్యాంకనం) పేరుతో మూడు రోజులు పరీక్షలు నిర్వహించేవారు. తాజాగా పరీక్షల షెడ్యూల్ ప్రకారం ఆరు రోజులు పరీక్షలు నిర్వహిస్తారు. ఆ దిశగా స్వీయ మూల్యాంకనం-1 పరీక్షలు సెప్టెంబర్ 4వ తేదీ వరకు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేటు మినహా అన్ని ప్రభుత్వ అనుబంధ పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ద్వారా పరీక్షా పేపర్లను సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. సత్యవేడు నియోజకవర్గంలో 300 ప్రాథమిక, 35 ప్రాథమికోన్నత, 53 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 25,748 మంది విద్యార్థులు చదువుతున్నారు.

20 మార్కులకు పరీక్ష

ఇప్పటివరకు యూనిట్ పరీక్షల స్థానంలో నిర్వహించే ఫార్మేటివ్ పరీక్షలు 20 మార్కులకు మాత్రమే ఉండడంతో ఉదయం, మధ్యాహ్నం కలిపి రెండేసి పరీక్షల చొప్పున నిర్వహించి, మూడు రోజుల్లో పూర్తి చేసేవారు. తాజాగా కూటమి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం సబ్జెక్టుకు ఒక రోజు చొప్పున ఆరు రోజుల పాటు నిర్వహించనున్నారు. దీంతో సిలబస్‌పై ప్రభావం చూపుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. నెలవారీ సిలబస్‌లో మూడు రోజులు కుదించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

డీసీసీబీ నుంచి ప్రశ్నాపత్రాలు సరఫరా



నిర్మాణాత్మక మూల్యాంకనం పేరును స్వీయ మూల్యాంకనంగా మార్చి పరీక్షలు నిర్వహిస్తున్నారు. డీసీసీబీ ద్వారా పరీక్షా పత్రాలను ఆయా పాఠశాలలకు చేరవేశాం. 3 నుంచి 8 తరగతుల వరకు సీబీఏ విధానంలో ఓఎంఆర్ షీట్స్‌పై పరీక్షలు జరుగుతాయి. -సరస్వతి, ఎంఈఓ, వరదయ్యపాళెం మండలం

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


వంటగదిని పరిశీలిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్టల్‌లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు తెలిపారు. వారు శుక్రవారం స్థానిక బీసీ, బాలుర హాస్టల్‌ను గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, వైద్య సిబ్బందితో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలని తెలిపారు. బీసీ హాస్టల్ వార్డెన్ రామయ్య పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని పలు ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రోడ్లు భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన్ని తిరుపతిలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే శుక్రవారం ఉదయం కలసి నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రోడ్ల పరిస్థితులను వివరించారు. ప్రధానంగా నాగలాపురం-చిన్న పాండూరు రోడ్డు, సత్యవేడు-తడ, తడ-వరదయ్యపాళెం, ఊత్తుకోట-సత్యవేడు ప్రధాన రోడ్ల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, తక్షణమే నిధుల మంజూరుకు సహకరించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చట్టరీత్యానేరం


మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ, ఎస్టీలపై ఇతర కులాల వారు కుల వివక్ష చూపితే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. శుక్ర వారం మండలంలోని నీర్పాకోట ఎస్టీ కాలనీలో సామాజిక న్యాయంపై రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారుల ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు వారికి ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన పెంచుకోండి

నారాయణవనం: రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవడంపై ప్రతిపౌరుడు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ జయరాములు పేర్కొన్నారు. మండలంలోని తుంబూరు పంచాయతీ శ్రీనివాస ఎస్టీకాలనీలో శుక్రవారం పౌర హక్కుల అవగాహన సభను నిర్వహించారు. సర్పంచ్ నాగూరు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్ జయరాములు మాట్లాడుతూ పౌరునికి రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కల్గించడం నేరమన్నారు. పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల ద్వారా పొందే సేవలను, హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ డాక్టర్ వేణయ్య తెలిపారు. మెరుగైన సౌకర్యాలను పొందడానికి పంచాయతీకు చెల్లించాల్సిన పన్నులను సకాలంలో చెల్లించి, అభివృద్ధికి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి గీత కోరారు. సమావేశంలో వీఆర్వోలు పళణి, ప్రదీప్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కుంకుమ పూజ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలో ఉన్న అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా హిందూ ధర్మ ప్రచార మండలి జిల్లా సభ్యులు పోతుల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమపూజ నిర్వహించారు. అనంతరం తిరుచానూరు అమ్మవారి పసుపు దారాలు, పసుపు కుంకుమ, కంకణాలు, రుద్రాక్షలు, అమ్మవారి భక్తి పుస్తకాలను పంపిణీ చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రేణుకాదేవి, సుజాత, చంద్రమణి, సుధారాణి పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ

నారాయణవనం: పద్మావతీ అమ్మవారు శుక్రవారం ఊంజల్ సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7 గంటలకు స్వామివారికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలు చేశారు. సాయంత్రం పద్మావతీ అమ్మవారిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి అంతర ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆలయాధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసభట్టాచార్య, నరసింహ భట్టాచార్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.





శ్రీకాళహస్తిలో జోరువాన

శ్రీకాళహస్తి: పట్టణంలో శుక్రవారం జోరు వాన కురిసింది. శుక్రవారం సాయంత్రం సుమారు గంట పాటు వర్షం కురిసింది. దీంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

వేడుకగా పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత్రి ఓల్గా, అతిథులు

రేణిగుంట: మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకావిష్కరణ శుక్రవారం మండలంలోని అమరరాజా కర్మాగారంలో వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్రవిడవర్సిటీ మాజీ వీసీ కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షతన జరిగింది. రచయిత్రి ఓల్గా(కె.లలితకుమారి) పుస్తకాన్ని ఆవిష్కరించారు.

వైఎస్సార్‌తో అనుబంధం ప్రస్తావన

మొత్తం 950 పేజీల పుస్తకంలో చిన్నతనం, అమెరికాలో తాను గడిపిన జీవితం, రాజకీయ ప్రవేశం, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా, మంత్రిగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌తో తనకున్న అనుబంధాన్ని గురించి ప్రస్తావించారు. తాను మంత్రిగా ఉండగానే, చిత్తూరు జిల్లా రచ్చబండ పర్యటనకు వస్తూ వైఎస్సార్ దుర్మరణం పాలైనప్పుడు తాను అనుభవించిన బాధను గురించి పుస్తకంలో రాశారు. అమరరాజ వ్యవస్థాపకులు గల్లా రామచంద్రనాయుడు, మాజీ ఎంపీ, అమరరాజ ఎండీ గల్లాజయదేవ్, అమర ఆస్పత్రి అధినేత్రి డాక్టర్ రమాదేవి గొరినేని, ఎమెస్కో సంపాదకులు చంద్రశేఖర్‌రెడ్డి, రచయితలు భూమన్, సాకం నాగరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ నాయకులు

సత్యవేడు: ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సత్యవేడు ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. శుక్రవారం ఎన్‌ఎంయూ రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు డ్యూటీ అలవెన్స్ అందడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్యారేజ్ అధ్యక్షుడు నరేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సుధాకర్, నాయకులు కుప్పయ్య, నాగరత్నం, కమరీముల్లా, విజయన్, మహేష్, ఏకాంబరం, ఆదిలక్ష్మి, బాలాజీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న కానిస్టేబుళ్లు

బుచ్చినాయుడుకండ్రిగ: ఆటోవాలాలు బుచ్చినాయుడుకండ్రిగ మెయిన్‌రోడ్డుపై అడ్డగోలుగా ఆటోలను ఆపకూడదని, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధలను పాటించాలని హెడ్ కానిస్టేబుల్ బాలగురవయ్య, కానిస్టేబుల్ రేగ తెలిపారు. వారు శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్‌రోడ్డులో ఆటోలు ఆపిన ఆటోవాలాలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి రికార్డులను సక్రమంగా ఉంచు కోవాలని తెలిపారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఎంజీవీధిలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా పసుపుకొమ్ములతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి అనంతరం పసుపుకొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం అమ్మవారికి శుక్రవార ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారి ఉత్సవమూర్తి విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారోత్సవం నిర్వహించారు.

ఆ భూములు పేదలకు పంచండి

- నిరసన తెలిపిన బత్తలవల్లం గ్రామస్తులు


నిరసన తెలుపుతున్న బత్తలవల్లం దళితులు

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం వద్ద వివాదాస్పదంగా మారిన ఓవలగుంట భూములను స్థానిక పేదలకు పంపిణీ చేయాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బత్తలవల్లం దళితవాడకు చెందిన స్థానికులు వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. 1960 నుంచి తరతరాలుగా తమ అనుభవంలో ఉన్నాయని, అయితే ఆ భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించి రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టి ఆ భూముల పూర్వాపరాలను తెలుసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

సీతారాముల సేవలో అంజూరు

శ్రీకాళహస్తి: పట్టణంలోని వీఎంపల్లెలో ఉన్న సీతారాముల మందిరంలో చిత్రపటం ప్రతిష్ఠ, కుంభాభిషేకంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆయన స్వామి అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు ఆయనను శేషవస్త్రంతో సత్కరించారు. పసల కుమారస్వామి, కయ్యూరు ఈశ్వరయ్య, సుబ్బారావు, పసల సుమతి, పసల కృష్ణయ్య, రామచంద్రయ్య, వెంకటరమణ, పలస సురేష్, వెంకటేష్, నాగరాజు, సీతా రాం, వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు వాణిజ్య పంటలు పండించాలి


వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న యూపీ మంత్రి

రేణిగుంట: రైతులు లాభసాటి అయిన వాణిజ్య పంటలను పండించడానికి మొగ్గు చూపాలని ఉత్తరప్రదేశ్ వ్యవసాయ శాఖామంత్రి సూర్యప్రతాప్ సాహీ అన్నారు. మండలంలోని కరకంబాడి వనస్థలిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ముందుగా ఆచార్య ఎన్.జి.రంగా విగ్రహానికి నివాళులర్పించి, ఆచార్య రంగా రైతు సంక్షేమం కోసం చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి గుర్తు చేసుకొన్నారు. వేరుశనగ, పెసర విత్తనోత్పత్తి క్షేత్రాలు, ఆయుర్వేద నిలయం, అజోల్లా పెంపకం, ఔషధమొక్కల నర్సరీ, భూసార పరీక్షా కేంద్రం, మల్బరీ ప్రదర్శనా క్షేత్రం, అధిక సాంద్రత పద్ధతిలో మామిడి, వర్మీకంపోస్ట్ తయారీ ప్రదర్శనా క్షేత్రాలను సందర్శించి కేవీకే శాస్త్రవేత్తలను, సిబ్బందిని అభినందించారు. శాస్త్రవేత్తలు శ్రీలత, సుధాకర్, దివ్య, రాము కుమార్, జేడీ షణ్ముగం పాల్గొన్నారు.

చెట్లతో పర్యావరణ పరిరక్షణ


మొక్క నాటుతున్న హెచ్‌ఎం నిర్మల్ కుమార్

ఏర్పేడు: చెట్లతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ప్రధానోపాధ్యాయుడు నిర్మల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బండారుపల్లె హైస్కూల్‌లో వనమహోత్సవం నిర్వహించారు. ముందుగా ప్రతిజ్ఞ చేసి, ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ చెట్లు లేకుంటే మానవ మనుగడకే ముప్పువాటిల్లుతుందన్నారు. చిన్నతనం నుంచి విద్యార్థులు మొక్కలు నాటడం అలవరచుకోవాలని సూచించారు. అడవులు, గ్రామాల్లో చెట్లు నరికివేతకు గురికాకుండా చూడాలని చెప్పారు. ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, గుణశేఖర్‌రెడ్డి, ద్వారకానాద్‌రెడ్డి, కుమార్ రాజా, ఉమామహేశ్వర్, సురేష్‌బాబు, రాధాకుమారి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

పాత పింఛను విధానం అమలు చేయాలి


నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి: యూపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద శుక్రవారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సహాధ్యక్షుడు సూర్యప్రకాష్ మాట్లాడుతూ యూపీఎస్ విధానాన్ని ఇటు యూటీఎఫ్, అటు జాతీయ స్థాయిలో ఎస్టీఎఫ్ఐ వ్యతిరేకిస్తోందన్నారు. యూపీఎస్‌తో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒరిగేది ఏమీ లేదన్నారు. ఓపీఎస్ అమలు అయ్యేవరకు తమ పోరాటం సాగుతుందన్నారు. అనంతరం డీటీ రూప్‌చంద్‌కు వినతిపత్రం అందజేశారు. మోహన్‌బాబు, విజయకుమార్, విజయశ్రీ, శ్రీనివాసులు, శివకుమార్, దీపిక, మునెయ్య పాల్గొన్నారు.